# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

OCTOBER-2014

సంవత్సర చందా రూ. 50/-

# బైబిల్ లెక్చర్‌షిప్

## BIBLE LECTURE SHIP

**స్థలము** : సత్యవాణి – క్రీస్తు సంఘము
7-9-35, సాంబమూర్తి వీధి,
కుళాయిచెర్వు ఎదురుగా,
రామారావు పేట, కాకినాడ – 533 004

**సమయం** : 2014 నవంబరు,11 నుండి 14 వరకు
ప్రతిరోజు ఉదయం 10 గంటలకు
ప్రారంభమగును

**ప్రసంగీకులు** : అనుభవజ్ఞులైన స్వదేశ విదేశ సహోదరులు
ఉపన్యసించెదరు.

భోజన వసతి ఉచితం, మొదట్లో 20/- రూ॥లు రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రము కట్టవలెను. ఆ కూటములకు హాజరగుటకు సిద్ధపడండి. ప్రార్థించండి, తప్పక రండి.

వందనములతో
జాషువా గూటం
రిక్కీ గూటం
రోని గూటం

ఫోన్ నెంబరు : 0884 – 2363722, 9866733965, 9849186081

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 34 | అక్టోబరు - 2014 | సంచిక - 3

## "క్రీస్తు మరల వచ్చునప్పుడు - 2"
## (When Christ Comes again)

యేసుక్రీస్తు రెండవసారి రాబోవు చున్నాడని బైబిలు బోధించు సత్యములను కొన్నింటిని గత సంచికలో మనము తెలిసికొని యున్నాము. ఆయన రెంవడ రాకడకు ముందు జరుగ వలసియున్న సంగతులన్నియు నెరవేరి యున్నవని అందువలన ఆయన ఏక్షణమందైనా ప్రత్యక్షము కాగలరని మనము నేర్చుకొని యుంటిమి. అంతేకాదు ఆ ఘడియ ఎప్పుడో మనమెవరము ఎరుగము గనుక మనము ఎల్లప్పుడు సిద్ధపడి యుండ వలెనని కూడ మనము గ్రహించి యుంటిమి. క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చిన సత్యములను మరికొన్నింటిని దైవవేదము నుండి ఈరోజు పరిశీలిం చెదము.

ఆయన రెండవసారి వచ్చునప్పుడు ఏరీతిగా వచ్చును? అనే ప్రశ్న మనకు తరచు ఉద్భవింప వచ్చును. ఆయన వ్యక్తి గతముగా, తానే వచ్చునని బైబిలు బోధించుచున్నది. "ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని

బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును" అని 1 థెస్స 4:16 లో వ్రాయబడి యున్నది. ఆయన తన దూతలతో కూడ వచ్చునని మత్తయి 25:31లో వ్రాయబడి యున్నది. అంతే కాదు, ఆయన అందరకు కనబడు రీతిగా రాబోవుచున్నారు: "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు; ప్రతి నేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచిన వారును చూచెదరు; భూజను లందరు ఆయనను చూచి రొమ్ము కొట్టు కొందురు; అవును ఆమెన్" అని ప్రకటన 1:7లో వ్రాయబడి యున్నది. ఆయన మేఘములగుండా పరలోకమునకు కొని పోబడెను గనుక మేఘారూఢుడై తిరిగి వచ్చునని అపొ.కా. 1:11 బోధించు చున్నది. ఆయన తన మహిమ ప్రభావము లతో రాబోవుచున్నారు (మత్తయి 25:31, 16:27, తీతు 2:13).

ఆయన మొదటిసారి పాపులను రక్షించుటకు వచ్చెను గదా ఆయన రెండవసారి ఎందునిమిత్తము రాబోవు చున్నారు? అనే ప్రశ్న తరువాత మనకు రావచ్చును. ఆయన రెండవసారి వచ్చు నప్పుడు ఏమి చేయునో అను సంగతిపై అనేక అసత్య సిద్ధాంతములు ఈ రోజులలో బోధింపబడుచున్నవి. ఆయన రెండవసారి వచ్చునప్పుడు ఈ భూమిపై తన రాజ్యమును స్థాపించి వెయ్యేండ్లు ఆయన పాలన చేయునని అనేకులు తలం చెదరు. నిజానికి బైబిలు అట్టి దేదియు బోధించుటలేదు సరిగదా యేసు తన రాజ్యము ఈలోకసంబంధమైనది కాదని ప్రకటించెను (యోహాను 18:36). ఆయన రాజ్యము ఆత్మీయ మైనది. అది మన మధ్యనే యున్నదని యేసు బోధించెను (లూకా 17:21). ఆయన రాజ్యమే ఆయన సంఘము. ఎవరైతే క్రీస్తును నమ్మి, ఆయనను తమ ప్రభువుగా హృదయములో ప్రతిష్ఠిం చుకొని ఆయనకు విధేయులై యుందు రో వారే ఆయన ఆత్మీయ రాజ్యమై యున్నారు. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివా సులనుగా చేసెను" అని అందుకే కొలస్సయిలో యున్న క్రైస్తవులకు అపొ. పౌలు వ్రాసెను (కొలస్స 1:13). "మీ సహోదరుడను, శ్రమలలోను, రాజ్యము లోను, సహనములోను పాలివాడనునైన యోహానను నేను" అని యోహాను తనను గూర్చి తాను పలికెను (ప్రకటన 1:9). మొదటి శతాబ్దమునాటికే

రాజ్యము స్థాపింపబడి యుండని యెడల వీరు ఆరాజ్యములో ఎట్లుండగలరు? యేసుక్రీస్తు రెండవసారి వచ్చునప్పుడొక భూసంబంధమైన రాజ్యమును స్థాపించరు సరిగదా ఆయన తన రాజ్యమును తన తండ్రికి అప్పగించివేయునని 1కొరింధి 15:24 చెప్పుచున్నది. అది ఇట్లను చున్నది: “అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగిం చును; అప్పుడు అంతము వచ్చును”.

క్రీస్తు మరల వచ్చునప్పుడు యెరూషలేములో దావీదు సింహాసనము మీద నుండి పరిపాలించునని కొందరు తలంచెదరు. అయితే ఆయన మరల వచ్చునప్పుడు ఈభూమియు, దాని మీదనున్న సమస్త కృత్యములును కాలిపోవునని 2 పేతురు 3:10 చెప్పు చున్నది. ఆయన రెండవసారి వచ్చున ప్పుడు కాదు గాని మృత్యుంజయుడై లేచి పరలోకమునకు ఆరోహణ మవగానే ఆయన దావీదు సింహాసనముపై ఆసీనుడై యున్నాడని అపొ.కా. 2:30-34 బోధించుచున్నది. ఆయన మరల వచ్చున ప్పుడు యూదులనందరినీ పాలస్తీనాలో చేర్చుననియు, వారందరినీ క్రైస్తవులుగా మార్చుననియు కొందరి యభిప్రాయము. యేసుక్రీస్తు మృతులలో నుండి ఎప్పుడైతే లేచెనో అప్పుడే యూదులు దేవుని ప్రత్యేక జనాంగముగా తిరస్కరించబడి యున్నారు. ఇప్పుడు యూదుడని, అన్యుడని, దాసుడని, స్వతంత్రుడని, పురుషుడని, స్త్రీ అని భేదములేదు. యేసుక్రీస్తునందు మనందరము సమానులమే యని వాక్యము బోధించు చున్నది (గలతీ 3:28).

యేసుక్రీస్తు రెండవసారి వచ్చు నప్పుడు మృతుల పునరుత్థానము జరుగును. మరణము సంపూర్ణముగా నాశనము చేయబడును. “దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చు చున్నది; ఆ కాలమున సమాధులలోనున్న వారందరు ఆయన శబ్దమువిని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరు త్థానమున కును బయటికి వచ్చెదరు” అని యేసు బోధించెను (యోహాను 5:28). “ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము గాని నిమిషములో ఒక రెప్పపాటున కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా

లేపబడుదురు. మనము మార్పు పొందుదుము.... ఈ క్షయమైనది అక్షయతను ధరించు కొనినప్పుడు ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు - విజయమందు మరణము మ్రింగివేయబడెను అను వ్రాయబడిన వాక్యము నెరవేరును" అని 1కొరింథి15:51- 54లో అపో.పౌలు వ్రాసెను.

క్రీస్తు రెండవసారి వచ్చునప్పుడు ఈభూమ్యాకాశములు నాశనము చేయబడును: "అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆదినమున ఆకాశములు మహా ధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతోలయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును" అని అపో.పేతురు వ్రాసెను (2 పేతురు 3:10). ప్రకటన 20:11; 21:1లను కూడ దయ చేసి చదవండి.

క్రీస్తు రెంవడసారి వచ్చునప్పుడాయన మానవులందరికిని, ఆయనపై తిరుగుబాటు చేసిన దూతలకును తీర్పు తీర్చును. అంత్య దినమున జరుగు ఆ గొప్ప తీర్పు దృశ్యమును భక్తుడైన యోహాను ప్రకటన గ్రంథములో ఇట్లు వర్ణించెను: "మరియు ధవళమైన మహా సింహాసనమును, దానియందు ఆసీనుడై యున్న యొకనిని చూచితిని భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను; వాటి కి నిలువచోటు కనబడకపోయెను. మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను.... ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి. ఎవని పేరైనను జీవ గ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" (ప్రకటన 20:11-15).

ఆయన పై తిరుగుబాటు చేసిన దూతల విషయమై పేతురు ఇట్లు వ్రాసెను: "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక పాతాళలో కమందలి కటిక చీకటి గల బిలముల లోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2 పేతురు 2:4).

యేసుక్రీస్తు రెండవసారి వచ్చునప్పుడు భూమిపై నున్న ఆయన పరిశుద్ధసంఘము ఆయనతో నిత్యము ఉండుటకై చేర్చబడును. అప్పుడు దేవుని నివాసము మనుష్యులతో కూడ

ఉండును. ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలై యుందురు, దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడై యుండును. ఆయన వారి కన్నుల ప్రతిబాష్ప బిందువును తుడిచివేయును. మరణము ఇక ఉండదు అని పరిశుద్ధాత్ముడు ప్రకటన 21:3,4 లో బోధించుచున్నాడు. "ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడ లేదుగాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుము" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 3:2).

యేసుక్రీస్తు మరల వచ్చునప్పుడు సువార్త యుగము అంతమగును. కాలము ఇక లేకపోవును. పరిశుద్ధులు క్రీస్తుతోను, దేవునితోను చేర్చబడుదురు గనుక ఇక బాప్తిస్మము, ప్రభు రాత్రిభోజనము అనునవి ఉండవు. ఏలయనగా వాటి అవసరత ఇకలేకపోవును.

క్రీస్తుయొక్క రెండవ రాకడను గూర్చి గత రెండు పాఠములలో మనము దైవవేదము నుండి గమనించిన సత్యములనుబట్టి ఆయన తన విశ్వాసులకు ఆదరణకరమైన వాగ్దానములను చేసెనని గ్రహించు కొనగలము. ఆయనకు విధేయత చూపు విశ్వాస జీవితమును జీవించిన యెడల పరలోకము మనదగును. క్రీస్తు యొక్క రెండవ రాకడను బట్టి దుర్మార్గులకు, అవిశ్వాసులకు, అవిధేయులకు గొప్ప నాశనము సంభవింపబోవుచున్నదని ఆయన హెచ్చరించుచున్నారు. క్రీస్తు ఈనాడు, ఈ ఘడియయందే వచ్చిన యెడల నీపరిస్థితి యెట్లుండును? నీవు సంతోషముతో ఆయనను ఎదుర్కొనగలవా? లేక భయముతోను దుఃఖముతోను నీరొమ్ము కొట్టుకొందువా? ఆలోచించుకొనుము.

## గమనిక:

ఉచిత బైబిల్ కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆకోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును

– ఎడిటర్.

# పడిపోయిన నాణెము
## (The Lost Coin)

లూకా 15:8-10

**పరిచయము:**

లూకా సువార్త 15వ అధ్యాయములో యేసు పడిపోయిన నాణెమును గూర్చిన ఉపమానము చెప్పారు. ఆ అధ్యాయములో ఇది రెండవది. ఆయన తప్పిపోయిన గొర్రె, పడిపోయిన నాణెము, తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానములు ఒకే సందర్భములో, ఒకేజనసమూహమునకు బోధించారు. పరిసయ్యులకు, శాస్త్రులకు జవాబుగా యేసు ఈ ఉపమాన సంపుటిని బోధించారు (లూకా 15:2). యేసును సుంకరులు పాపులు సంతోషముతో అంగీకరించేవారు. అందు వలన శాస్త్రులు పరిసయ్యులు ఆయనను విమర్శించేవారు (లూకా 15:1-2).

పాపుల యెడల మన స్వభావమును గూర్చి ముఖ్యముగా పడిపోయిన నాణెమును గూర్చిన ఉపమానము తెలియజేయుచున్నది. తప్పిపోయిన పాపియొక్క ఆత్మవిలువను గుర్తించుచు అతని వెదుకుట ఇందులో మనకు కన్పడుచున్నది.

యేసుక్రీస్తు వలెనే ఆదిమ సంఘము పాపులను శ్రద్ధతో వెదికే వారు. నిజానికి మొదటి శతాబ్ధపు క్రీస్తు సంఘము పాపులతో సహవసించుటకు వెనుదీయ లేదు. వారికి బోధించి మారుమనస్సు పొందిన తరువాత సహవాసములోనికి ఆహ్వానించుటకు వారు వెనుదీయలేదు.

పడిపోయిన నాణెము యొక్క విలువ, అదిపడిపోయిన స్థలము, సందర్భములను యేసు చక్కగా ఈ ఉపమానములో వర్ణించారు. పడిపోయిన నాణెము రోమా దేశపు దేనారముతో సమానముగల వెండినాణెము. అది అనాటి ఒక రోజు జీతముతో సమానము. ఆనాటి యూదా స్త్రీలు పదినాణెములను పోగుచేసికొని మెడలో ఒక హారముగా ధరించుకొనేవారు. మరీ ముఖ్యముగా వివాహితులైన స్త్రీలు ఈ నాణెముల హారమును ధరించేవారు. ఏది ఏలాగయినా, ఒక హారములో భాగముగా గాని, లేదా దాచబడిన ధనమువలెగాని అది పడిపోగా దాని విలువ అత్యంతమైనదిగా ఆస్త్రీ పరిగణించినది. ఆమె దాని కొరకు శ్రద్ధగా వెదకినది. అది పడిపోగా ఆమె ఒక దీపము వెలిగించి తన ఇల్లంతా ఊడ్చినది. ఆరోజులలో

యిండ్లకు సాధారణముగా కిటికీలుండేవి కావు గనుక పగటివేళకూడ దీపము అవుసరము. లోపల అంతామట్టితో అలుకబడి యుండేది. గనుక పడిపోయిన ఆ నాణెము ఇంటిలోనే కనబడకుండా ఎక్కడైనా యుండవచ్చును. గనుక దానిని వెదకుట కష్టమే. చివరకు అది దొరికే సరికి ఆమె యొక్క సంతోషము పట్ట జాలనిది. పడిపోయిన ఆ వెండినాణెము ఆమెకు దొరికినది.

**ఉపమానము :**

"ఏ స్త్రీకైనను పది వెండినాణెము లుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకొంటె ఆమె దీపము వెలిగించి యిల్లు ఊడ్చి అది దొరుకు వరకు జాగ్రత్తగా వెదకదా? అది దొరికినప్పుడు తన చెలికత్తెలను పొరుగు వారిని పిలిచి - నాతో కూడ సంతోషించుడి, నేను పోగొట్టుకొనిన నాణెము దొరికినదని వారితో చెప్పును గదా. అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల యెదుట సంతోషము కలుగునని మీతో చెప్పు చున్నానని" యేసు చెప్పెను (లూకా 15:8-10).

పడిపోయిన నాణెము, తప్పి పోయిన గొర్రె పాపములో బడి నశించిన వానికి సాదృశ్యముగా యున్నదనుట విదితమే. పడిపోయిన నాణెమువలె అనేకులు పాపములో పడియున్నారు. గాని వారు పడిపోయినట్లు ఎరుగురు. నశించిన వాని ఆత్మ పడిపోయిన వెండి నాణెము వలె యున్నది.

పడిపోయిన నాణెముపై కైసరు యొక్క ముద్ర ఎట్లుండెనో (లూకా 20:24), అట్లే, పాపములో పడిపోయిన వాడు ఆత్మీయముగా దేవుని స్వరూపము కలిగినవాడై యుండును (ఆది.కా. 1:26). పడిపోయిన నాణెము యజ మానికి ఎట్లు నిరుపయోగమైనదో, తప్పిపోయిన పాపి దేవుని సేవకు నిరుపయోగియవుతాడు. పడిపోయినా సరే, నాణెము విలువగలది గనుక దాని యజమాని తిరిగిపొందగోరును. దాని పోగొట్టుకొనిన స్త్రీ దాని తిరిగి పొంద డానికి సర్వ విధాల ప్రయత్నం చేసినది. అదే రీతిగా నశించిన పాపిని తిరిగి పొందడానికి దేవుడు సర్వ విధాల ప్రయత్నం చేయును. తన వాక్యము ద్వారా, కాపుదల ద్వారా, క్రైస్తవుల ద్వారా ఆయన వారిని వెదకును.

నాణెము పడిపోయినా సరే, అది యింటిలోనే యుండునని ఈ ఉపమానము తెలియజేయుచున్నది. అదే రీతిగా లక్షలాది ప్రజలు లోకములో నశించిపోయినా, సంఘములోనే

యుంటూ నిరుపయోగమైన క్రైస్తవు లుందురు. పడిపోయిన నాణెము విలువ గలదేగాని అది చెలామణిలో లేదు.

దేవుని వాక్యమే దీపము. సంఘము దానిని వెలిగించి పాపులను వెదకును. సువార్త వెలుగుకు బదులుగా మానవ కల్పిత సిద్ధాంతములను వినియోగిస్తే, పాపులను గుర్తించుట కష్టమగును. భౌతిక సంబంధ ఆకర్షణ లనుపయోగిస్తే, అక్కడ గుమికూడేవారు తప్పిపోయిన పాపులే. పడిపోయినట్లు వారు గుర్తెరుగరు.

**ముగింపు :**

పడిపోయిన నాణెము నుండి మనం అనేక పాఠములు నేర్చుకొన వచ్చును. నశించిన పరిస్థితి ఒకటి యున్నది. దేవుడు నశించిన వారిని వెదుకుచు యున్నారు.

ఆయన చిత్తప్రకారము వారిని రక్షించుటకు ఆయన ప్రయత్నము చేయుచు యుండును.

పడిపోయిన నాణెము కొరకు ఆ స్త్రీ చాల శ్రద్ధజూపినది.

నశించిన వారి కొరకు, సభ్యుల కొరకు సంఘము శ్రద్ధకలిగి యుండాలి.

నాణెము వెదుకుటకు ఆస్త్రీ వెళ్లినది. నాణెము ఆమె యొద్దకు వచ్చుటకు ఆమె కనిపెట్టలేదు. నశించిన వారు తమకుతామే రావాలని సహోదరులు కనిపెట్టుదురు. పడిపోయిన నాణెము కొరకు తన యొద్దనున్న వస్నీ స్త్రీ వినియోగించినది. అది నాకు దొరుకదని ఆమె ఎన్నడు తలంచలేదు. నేడు కూడ దేవుడు తన వాక్యమనే దీపమును వినియోగించు చున్నారు. దాని సహాయముతో సంఘము ద్వారా ఊడ్చుచున్నారు. మారుమనస్సు పొందేవారు ఇంకను యున్నారని క్రైస్తవులు విశ్వసించాలి. పడిపోయిన నాణెము తప్పక దొరికే అవకాశమున్నది.

విచారం యేమంటే నశించిన ఆత్మలను గూర్చిన చింత నేటి సంఘము నకు కొదువగా యున్నది. మన కుటుంబాలతో సుఖముగానే యుండి (ఆమోసు 6:1) నశించిన వారిని గూర్చిన చింతలేకయున్నాము.

ఒకపాపి మారుమనస్సు పొందితే నేటి సంఘము సంతోషించు చున్నదా?

– లూయిస్ రష్‌మోర్

# దేవుని బల్యర్పణ పద్ధతి
## (The Sacrificial System)

పాతనిబంధనలో దేవుడు బయలుపరచిన బలియర్పణ పద్ధతి (The Sacrificial System) గూర్చి మనము నేర్చుకొనబోవుచున్నాము. యిది ముఖ్యముగా లేవీయకాండములో చెప్పబడిన దానిపై ఆధారపడి యున్నది. లేవీయ కాండము గ్రంధమును చదువు చుండగా ఒకడు చాల అనాసక్తిని సహజముగా వ్యక్తపరచును. అయితే పాతనిబంధనలో లేవీయకాండము చాల ప్రాముఖ్యమైనది.

మొదటిగా మోషేధర్మ శాస్త్రము లో బయలుపరచబడిన బలులను స్టడీచేసి పాతనిబంధనలో యున్న వివిధరకము లైన ప్రవచనముల యొక్క వివరణ తెలిసికొందము. తదుపరి మాదిరి (Typology) పద్ధతిని గూర్చి తెలిసి కొందము. తదుపరి ఛాయారూపకముగా యున్న పద్ధతిని అనగా యేసుక్రీస్తు బలియాగముకు ఛాయా రూపకముగా యున్నవాటిని తెలికొందము.

లేవీయకాండము నిజానికి నిర్గమకాండము యొక్క కొనసాగింపే. ఇశ్రాయేలీయుల యొక్క ప్రాథమిక చరిత్రతో నిర్గమకాండము ముగియును మరియు దేవుడు తన ప్రజలను చట్టబాధ్యులుగా చేయుట కారంభమగును. లేవీయకాండమునకు ఉపోద్ఘాతము గా నిర్గమకాండమున్నది.

**యాజకులరాజ్యము మరియు పరిశుద్ధ జనాంగము :**

ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించిన తరువాత దేవుడు వారితో, "మీరునామాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచిన యెడల మీరు సమస్త దేశజనులలో నాకు స్వకీయసంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదేగదా. మీరునాకు యాజకరూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని" చెప్పెను (నిర్గమ 19:5-6). యాజకుని ప్రాథమిక విధి దేవునికి బలులు అర్పించుటయే. ఇశ్రాయేలు జనాంగమంతయు పరిశుద్ధ యాజకులుగాను, పరిశుద్ధ జనముగాను ఆయన కొరకు ఉండవలెనని దేవుడు కోరుకొనెను. 'పరిశుద్ధ' అనేపదము వారు దేవునికి చెందిన వారు మాత్రమేగాక దేవునితో ఇశ్రాయేలీయులకుండ వలసిన నైతిక సంబంధమును తెలియజేయుచున్నది.

తదుపరి నిర్గమకాండము 20 అధ్యాయములో దేవుడు పది ఆజ్ఞలతో కూడిన మోషే ధర్మ శాస్త్రమును వారికిచ్చెను. దాని ద్వారా ఇశ్రాయేలీయులు పాలింప బడవలసి యున్నది. అది వారి రాజ్యాంగము. పది యాజ్ఞలేగాక 613 చట్టములు మోషేధర్మశాస్త్రములో యున్నవి. అవి శాసనములు, కట్టడలు, నిబంధనలు మొదలగు నవియని చెప్పబడినది. 20వ అధ్యాయము తరువాత. ప్రత్యక్షగుడార నిర్మాణను, లేవీ యాజక ధర్మప్రతిష్ట, వారివిధులు, అర్పించ వలసిన బలులు వగయిరాలను గూర్చి తదుపరి అధ్యాయంలో మనకు కనపడును.

మోషేధర్మశాస్త్ర ప్రకారము బలియర్పణ పద్ధతిలో నాలుగుభాగము లున్నవి. ధర్మశాస్త్రము, యాజకులు, ప్రత్యక్షగుడారము, బలులు అనునవి, లేవీయకాండములో యున్న బలియర్పణ పద్ధతికి యివి ప్రాధమికములు.

లేవీయకాండమునుండి ప్రాముఖ్య పాఠములు :

లేవీయకాండము దేవుని గూర్చి అనేక ప్రాముఖ్యపాఠములను, ఆయన చట్టప్రకారముండవలసిన దైనందిన జీవితమును, ధర్మశాస్త్రప్రకారమైన ఆధ్యాత్మిక జీవితమును గూర్చి ప్రాముఖ్యవివరణలు మనకు తెలియజేయును. ఆ పాఠములు నేడు క్రైస్తవులకును ముఖ్యమే.

లేవీయకాండము దేవుని పరిశుద్ధతను గూర్చి మనకు తెలియజేయును. నిజానికి అది ఆగ్రంధము యొక్క ముఖ్యాంశము. దేవుడు పరిశుద్ధుడు మాత్రమే కాదు, ఆయన ప్రజలు కూడ పరిశుద్ధులే, ఆయన ఆవరణము పరిశుద్ధము, ఆయన బలులు పరిశుద్ధము. గనుక లేవీయకాండములో సమస్తము ప్రత్యేకమే.

రెండవదిగా ఇశ్రాయేలు జనాంగమునకు దేవుడు దైవిక పాలనను (Theocratic Rule) ప్రతిష్టించుటను లేవీయకాండములో చూడ గలము. దైవిక పాలన అనగా దేవుడే రాజుగా యుండి వారిని పాలించుట, దేవుడువారికి రాజుగా యుండగోరారు. గనుక ఆయన శాసనములను వారు గౌరవించి పాటించాలని కోరారు. ఏలయనగా ఆ ప్రజల మధ్య ఆయన సర్వాధికారి.

మూడవదిగా ఆజనాంగము ద్వారా దేవుడు సాధించగోరిన చారిత్రక సంగతులను గూర్చి లేవీయకాండము లో యున్న ఆరాధనా పద్ధతులను బట్టి

మనము తెలిసికొనగలము. లేవీయకాండములోని బలులు రక్షకుడైన యేసుక్రీస్తు యొక్క బలిని గూర్చిన ప్రవచనాత్మకములు.

నాల్గవదిగా పాపము యొక్క తత్వము, దాని పర్యవసానమును లేవీయకాండము మనకు నిశితముగా తెలియజేయుచున్నది. పాపమువలన దైవ మానవ సంబంధములు ఎట్లు విచ్ఛిన్న మగునో అదితెలియజేయుచున్నది. పాపము సహవాసమును విచ్ఛిన్నము చేయును. నిబంధన సంబంధమును అదిపాడుచేయును. గనుక అతిక్రమములు, పాపములు దేవుని పాలనను భంగముచేయును. కాబట్టి నిబంధన సంబంధము పునరుద్ధరింపబడదు. అయితే బలియర్పణ పద్ధతి ద్వారా దేవుడు కరుణా సంపన్నుడై ఈనిబంధన సంబంధమును తిరిగి ఎట్లు నెలకొల్పుకొనవచ్చునో లేవీయకాండము తెలియజేయుచున్నది.

లేవీయకాండములో యున్న బలులపద్ధతి, యాజకులు, ప్రత్యక్షగుడారము, నిబంధన మొదలగునవన్నీ ఇశ్రాయేలు జనాంగమును మెస్సీయ రాకకొరకు ఎట్లు సిద్ధపరచెనో తదుపరి మనము తెలిసికొనవచ్చును. ధర్మశాస్త్రము బాలశిక్షకుని వలె లేక ప్రాథమిక ఉపాధ్యాయుని వలె పని చేసెనని గలతీ 3:17 చెప్పుచున్నది. ఇశ్రాయేలీయులను గొప్ప బోధకుడు/ఉపాధ్యాయుడైన మెస్సీయ నొద్దకు ధర్మశాస్త్రము నడిపించెను. గనుక ఇశ్రాయేలీయులను మెస్సీయకొరకు సిద్ధపరచుటలో లేవీయకాండము ఉపయోగపడెను.

దేవుని ఆరాధించుటకు మానవునికున్న సహజకోరికలను దేవుడు ఎట్లు నడిపించెనో లేవీయకాండము తెలియజేయును తన ప్రజలు దేవుని ఎట్లు ఆరాధించారో ఈ గ్రంథము తెలియజేయును. ఆ యారాధన జరిపించుటకు కావలసిన నియమములను ఆయన అనుగ్రహించును. ఆయనకంగీకారయోగ్యమైన ఆరాధన ఏదో, ఏదికాదో ఆయన తెలియజేయును. ఆరాధన నమూనాను ఉల్లంఘించిన వారి ఉదాహరణలను ఆయన మనకు చూపించును. లేవీకాండము 10వ అధ్యాయములో నాదాబు, అబీహుల ఉదాహరణ మనకున్నది. దేవుని నియమముల చొప్పున మానవులు చేయు ఆరాధన యందు దేవుడు లక్ష్యముంచునని ఇట్టి ఉదాహరణలు మనకు తెలియజేయును.

లేవీయకాండములో యున్న గురుతులు, సంస్కారములు, పండుగ

దినములు మొదలగు వాటి ద్వారా మానవుని యొక్క నిత్యగమ్యము నిర్వచింపబడుట మనము చూడగలము. దేవునితో సహవాసము కలిగి యుండుటకు మానవుడు సృజింపబడెను, ఈలోకము లోనే కాదు రాబోవులోకములో కూడ. దేవుని నుండి వేరుచేయు అతని పాపములకు పరిహారముగా అతని బలులు ఉద్దేశించబడినవి, ఆబలుల ద్వారా మానవుడు తిరిగి దైవసహవాసమునకు తీసికొని రాబడెను. తద్వారా ఈజీవితానంతరము దేవునితో నిత్యము వుండుటకు అవి సాధ్యములాయెను. ఇంకోమాటలో దేవుడు మానవునితో ఇక్కడ ఈలోకములో మాత్రమే కాకుండ, రాబోవు నిత్యలోకములో కూడ సహవానము కలిగియుండుటకు, కోరుకొనుచున్నారు. ఇశ్రాయేలీయుల యొక్క విశ్రాంతి దినము కూడ విశ్వాసియైనవాడు దేవునితో నిత్యము గడుపు విశ్రాంతికి గురుతుగా యుండెనని హెబ్రీ పత్రిక తెలియజేయుచున్నది (హెబ్రీ 3,4 అధ్యా).

దేవుని యొక్క నిత్యనియమములలో మార్పు సంభవించదని లేవీయకాండము తెలియజేయుచున్నది. దాని యొక్క విధులు, కట్టడలు, ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారా దేవుడు తన ప్రజలను పాలించుటకిష్టపడుచున్నారు. చట్టము చట్టము వలెయుండాలంటే దాని నియమములకు లోబడు వారికి అది ప్రతిఫలములనియ్యాలి, అవిధేయులైన వారిని శిక్షించాలి. దేవుని చట్టము మారుచుయుండ వచ్చును. అది ప్రతి యుగములోను మారెను. గోత్ర కర్తల యుగము, మోషేయుగము, క్రైస్తవ యుగము. అయితే ప్రతియుగములో నున్నవారు దేవుడువారి కిచ్చిన ఆజ్ఞల చొప్పున నడువబద్ధులై యున్నారు మరియు వారి కాలములో అమలులో యున్న చట్టమును బట్టి తీర్పు పొందుదురు.

(సశేషం)

గమనిక:

**పాతనిబంధనలోని బలియర్పణపద్ధతిని గూర్చి రాబోవు సంచికలలో చక్కగా విశ్లేషించబడును. గనుక చదువరలు ప్రతిసంచికను భద్రము చేసికొంటే చాల మంచిది.**

– ఎడిటర్.

## అబద్ధ బోధల విషయంలో జాగ్రత్త
## (Beware of the False Teaching)

చాలామంది అనేకరీతులుగా తమ స్వార్థానికి ప్రజలహృదయాలను, వారి ఆత్మలను, యేసుప్రభువును ఎరుగనివ్వకుండా చేయుచున్నారు. తాము జ్ఞానులమని చెప్పుచూ బుద్ధిహీనులైరి రోమా 1:22.

క్రైస్తవ లోకంలో, బోధకుల వేషంలో బైబిల్ చేతబూని, లక్షలాది మంది ప్రజలకు టీ.వీ.ల ద్వారా అబద్ధ బోధ బోధిస్తున్నారు. వీరు స్వేచ్ఛగా అబద్ధబోధ బోధించుచూ ప్రజలకు మారుమనస్సు గురించి గాని, బాప్తీస్మము గురించి గాని, సంఘము గూర్చి గాని, ప్రభువుబల్ల గూర్చిగాని బోధించుట లేదు. ప్రజలు ఇచ్చే కానుకలతో పబ్బం గడుపుచున్నారు. ప్రజలను మోసం చేయుచూ, తమ్మును తాము మోసగించుకొంటూ, దేవుని కార్యములకు అడ్డుగా వున్నారు. ఇటువంటి దానిని గూర్చి యేసు మత్తయి 23:13-14లో చెప్పిరి: అయ్యో, వేషధారులైన శాస్త్రుల్లారా, పరిసయ్యులారా, మీరు మనుష్యుల ఎదుట దేవుని రాజ్యమును మూయుదురు మీరందులో ప్రవేశించరు. ప్రవేశించువారిని ప్రవేశం పనియ్యరు. జ్ఞానంలేకుండా ప్రస్తుతం మాత్రమే కాదు. యుగాలనుండి కూడా దేవుని సంకల్పమును ప్రజలు తెలుసుకోలేక పోవుచున్నారు. అందువలన దేవుని చిత్తాన్ని కలిపి చెరిపెడు బోధల వలన అనేకమంది క్రైస్తవలోకంలో ఏ బోధకుడు ఏ బోధ చేస్తాడో తెలియక అయోమయ పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు. అబద్ధబోధ నరనరాలలో జీర్ణించుకు పోయిన వారిలో గొప్ప పండితులు, గొప్ప చదువరులు, మేము పుట్టుకతోనే క్రైస్తవు లం అని చెప్పుకు తిరిగే సత్యవాక్యం ఎరుగని వాక్య జ్ఞానం లేనివారువున్నారు. గర్వమును వదిలి సత్యనుము ప్రేమతో స్వీకరించండి.

అపోస్తలుడైన పౌలు రోమ సంఘమునకు వ్రాసినది. రోమా 1:28-32 అట్టివారు సమస్తమైన దుర్నీతి చేతను. దుష్టత్వము చేతను. లోభము చేతను నిండుకొని - చెడ్డవాటిని కల్పించువారును, అవివేకులును నిర్ధయులును అయిరి. ఇప్పుడు లోకమంతా ప్రకటించబడు బోధతో 100కి 10% మాత్రవే ప్రభువువారు అపొస్తులు లకిచ్చిన బోధ ప్రకటించబడుచూవున్నది. 90% బోధ, యేసు బోధించిన బోధకాదు. అపోస్తలులు బోధించిన బోధకాదు, ఇలా చెడ్డవాటిని

కల్పించే వారు వస్తారని యేసు చెప్పిరి. లూకా 21:8 మీరు మోసపో కుండా చూసుకొనుడి. అనేకులు నా పేరిట వచ్చినేనే క్రీస్తుననియు. కాలం సమీపించె ననియు చెప్పుదురు. మరియు అపో.కా. 20:30 చదివిన శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు చెప్పువారు అనగా సత్యమును అసత్యము గా బోధించేవారు. వీరు క్రూరమైన తోడేళ్ల వంటివారు వీరు మందను కనికరించరని పౌలుగారు చెప్పిరి. అపొ.కా. 20:29 వీరు బోధించునది క్రీస్తుబోధ కాదు. మీరేమి వినుచున్నారో జాగ్రత్తగా చూచు కొనుడి (మార్కు 4:24).

కల్పితబోధ వలన అనేక కుటుంబాలు ఆత్మీయంగా నాశనమునకు సిద్ధముగా వున్నవి. అట్టివారు ఉపదేశింపకూడని వాటిని దుర్లాభము కొరకు ఉపదేశించుచు కుటుంబములకు కుటుంబములను పాడుచేయుచున్నారు (తీతు 1:11). అట్టివారు మన ప్రభువైన క్రీస్తునకు కాక తమ కడుపునకే దాసులు. వారు ఇంపైన మాటల వలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చెదరు (రోమా 16:18). అనేకమంది బోధకులు, వారికి తెలిసినదే వాక్యమని, వారి స్వంత ఉద్ధేశానుసారంగా స్వేచ్ఛగా బోధిస్తూ విచిత్రమైన మానవ పేర్లు సంఘాలకి పెట్టి కేరింతలు, గిలిగింతలు వివేకంలేని అరుపులు, వాయిద్య సంగీతముల ద్వారా సంఘములను ప్రేరేపిస్తున్నారు. దేవుని ఆరాధించే విలువల్ని దిగజార్చు చున్నారు. ఆలా చేయుట వారికి, వారిని అనుసరించేవారికి ఆటగా ఉన్నది. జీవము గల దేవుని చేతిలో పడుట భయంకరము. జాగ్రత్త (హెబ్రీ 10:31). నీవు క్రీస్తుప్రభువు తన స్వరక్తం ఇచ్చి సంపాదించిన ఆయన శరీరం అయిన క్రీస్తుసంఘంనందే వున్నావా? అందులో వుంటేనే నీవు పరలోకం వెళ్ళగలవు. ఏ సంఘం అయినా ఫర్వాలేదు. అందరు యేసు ప్రభువు వారి సంఘమే అనే భ్రమలో వున్నావా? అనేక సంఘములు యేసుప్రభువు కట్టలేదు (మత్తయి 16:18, ఎఫెస్సీ 4:4). సంఘము ఒక్కటే. ఒక్క పురుషునకి ఒక్క భార్య ఉంటుంది. అనేక శరీరములతో సాంగత్యము చేయువాడు వ్యభిచారి కాదా? ప్రభువు శరీరమైన సంఘము ద్వారా మాత్రమే లోకమునకు దేవుని నానావిధములయిన జ్ఞానం తెలియపరచబడవలెనని దేవుని సంకల్పం (ఎఫెస్సీ 3:8-11). నేడు ప్రభువు వారి ప్రియమైన సంఘములోనికి ప్రజలను ప్రవేశించకుండా దుర్బోధకులు

వారి దుర్బోధతో వారికి అడ్డుగా ఉన్నారు. వీరిని గూర్చి యూదా ఇలా వ్రాసారు అయ్యో వారికి శ్రమ. వారు కయీను నడిచిన మార్గమున నడచిరి. బహుమానం పొందవలెనని బిలాము నడచిన తప్పు త్రోవలో ఆతురముగా పరుగెత్తిరి (యూదా 1:11). కయీను అసూయపరుడు. ఈర్ష్య పరుడు. తన తమ్ముడైన హెబేలుని దేవుడు ప్రేమించుట చూడలేని మనస్సు గలవాడు. బిలాము, ఇశ్రాయేలీయులు మోయాబు రాండ్రతో వ్యభిచరించేలా ఉరులు పన్నిన భక్తిహీనుడు. దేవునియెడల ద్రోహి. వీరు భక్తిహీనులై యుండి దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగ పరచుచూ మన అద్వితీయనాథుడును. ప్రభువునైన యేసుక్రీస్తును విసర్జించి యున్నారు (యూదా 4). అంత్యకాలమందు తమ భక్తిహీనమైన దురాశల చొప్పున నడచు పరిహాసకులుందురు అని మన ప్రభువైన యేసుక్రీస్తు అపొస్తలులు పూర్వమందు మీతో చెప్పిన మాటలను జ్ఞాపకం చేసికొనుడి. అట్టివారు ప్రకృతి సంబంధులును ఆత్మలేనివారునై యుండి బేధములు కలుగజేయుచున్నారు (యూదా 17:18). ప్రియులారా, మీరు విశ్వసించు అతి పరిశుద్ధమైన దానిమీద మిమ్మును కట్టుకొనుచు, పరిశుద్ధాత్మలో ప్రార్థన చేయుచు, నిత్యజీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు కనికరము కొరకు కని పెట్టుచూ దేవుని ప్రేమలో నిలుచు న్నట్లు కాపాడుకొనుడి (యూదా 17:21).

రెవరెండులు, ఫాదర్లు, అల్లులైన వారి కలిపిచెరిపెడు బోధలు కాక క్రీస్తు బోధ వైపునకు ఆయన సంఘములోనికి నమ్మి బాప్తీస్మము పొంది రక్షింపబడి క్రీస్తుసంఘంలో చేర్చబడు, క్రీస్తుబోధ యందు నిలిచియుండు (2 యోహాను 9, అ.కా. 2:42). అపోస్తలు బోధయం దును, సహవాసమందును. రొట్టె విరచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగకయుండిరి. నీవు ఆరాధించుటకు వెళ్ళే సంఘములో క్రీస్తుబోధ ప్రకటింపబడుచున్నదా?' నీవు వెళ్ళే సంఘం పేరు నీవు పట్టుకున్న బైబిల్‌నందున్నదా? అందు ఉంటేనే పరలోకం లేకుంటే నిత్యనరకమే.

– ఓ. ప్రభుదాసు

క్రీస్తు సంఘము, మైలవరం

## అబానాయును, ఫర్పరును
## (Abanah and Pharpar )

అబానాయును ఫర్పరును దమస్కులోని రెండు నదులు. 2వ రాజుల గ్రంథము 5వ అధ్యాయములో మనకగుపడు నయమాను అను సిరియా దేశపు సైన్యాధిపతి ఇశ్రాయేలు దేశములో యున్ననదులన్నిటికంటె ఈ రెండు నదులు శ్రేష్ఠమైనవని తలంచాడు.

నయమాను మహాపరాక్రమశాలియై అతడుతనయజమానుని దృష్టికి ఘనుడై దయపొందినవాడాయెనని బైబిలు చెప్పుచున్నది (2 రాజు 5:1). గాని అతడు కుష్ఠరోగి! అయితే ఇశ్రాయేలు దేశమునుండి చెరగొనిన ఒక చిన్నది నయమాను యొక్క కుష్ఠరోగమును బాగుచేసే దైవజనుడొకడు తన దేశములో యున్నాడని వానికి తెలియజేసింది. వెంటనే సమయమును పోనియకుండా అతడు తన గుర్రములు, రథము వెంటబెట్టుకొని ఇశ్రాయేలు దేశమునకు వచ్చెను. అతడు ప్రవక్త యింటి దగ్గరకు రాగా, నయమాను యొక్క గర్వము నణచుటకును, తనను బాగుచేయువాడు దేవుడే గాని మానవుడు కాదని నేర్పించుటకును, ప్రవక్త తనయింటిలోనుండి సయితము బయటికిరాకుండా, నయమాను యొర్దాను నదికిపోయి ఏడుమారులు మునిగిన యెడల అతని కుష్ఠరోగము పోవునని కబురు పంపెను.

ఈ మాటవిని నయమాను బహురౌద్రుడై తిరిగి వెళ్లి పోవుటకు నిశ్చయించుకొని, "దమస్కు నదులైన అబానాయును ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటికంటె శ్రేష్ఠమైనవి కావా? వాటిలో స్నానము చేసి శుద్ధినొందలేనా?" యని తిరిగి వెళ్లిపోవుచుండెను. అయితే మార్గములో అతని సేవకులలో ఒకడు అతని శాంతింపజేసి యొర్దానులో ఏడుమారులు మునుగుటకు అతనిని ఒప్పించెను. నయమాను యొర్దాను నదికి వచ్చి ప్రవక్తచెప్పినట్లు ఏడుమారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను.

నయమాను ఆరోజు నేర్చుకొనిన గొప్ప పాఠము యేమంటే, దేవుడు ఏదైనా చెప్పియుంటే, దాని స్థానములో ఇంకొకటి మనము చేయరాదు. దేవుడు తన ప్రవక్త ద్వారా యొర్దాను అన్నప్పుడు ఆయన అబానాయు ఫర్పరును అని అనలేదు. నోవహు చితిసారకపు ద్రామనుతో

ఓడను నిర్మించుమని దేవుడు చెప్పినప్పుడు "నోవహు అట్లుచేసెను. దేవుడతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేసెను" (ఆది.కా. 6:22). మరల "పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగుటకై వ్రాయబడియున్నవని" కూడ బైబిలు చెప్పుచున్నది (రోమా 15:4).

మనము ఈ నాడు నేర్చుకోవలసిన పాఠం యేమంటే మనం దేవుని వాక్యాన్ని మార్చకూడదు. దానికి కలుపకూడదు, దాని స్థానముననే వేరొక దానిని ఉంచకూడదు (ప్రకట 22:18 –19). ఉదాహరణకు "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని మార్కు 16:16 చెప్పుచున్నది. దానిని మనం సరిగ్గానే అర్ధము చేసికొనగలము. అంటే రక్షించబడాలంటే ఒకడు నమ్మాలి, బాప్తిస్మముపొందాలి.

నమ్మిబాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని యేసు చెప్పినప్పుడు ఆయన పసిబిడ్డలను గూర్చి ఆమాటలు చెప్పలేదు. పసిబిడ్డలు నమ్మలేరు గనుక వారికి ఈయాజ్ఞవర్తించదు. బాప్తిస్మము పొందుట అనగా నీటిలో ముంచబడుట. అది చిలకరింపు, కుమ్మరింపు కాదు. 'బాప్టిజో' అను గ్రీకుపదమునకు సంపూర్తిగా ముంచుట లేకపాతి పెట్టుటయని అర్ధము. కొలస్స 2:12లో "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టుబడినవారై ఆయనను మృతులలో నుండిలేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" యని పౌలు చెప్పాడు.

మొదట్లో నయమాను దేవుని ఖచ్చితమైన, తేలికయైన ఆజ్ఞను ఎట్లు నిరాకరించాడో, అట్లే అనేకులు సువార్తయిచ్చు తేలికయైన ఆజ్ఞలను నిరాకరించుచున్నారు. బాప్తిస్మము పొంది పాపమునుండి శుద్ధులగుటకు నిరాకరించుచున్నారు. గాని దేవుడు చెప్పినట్లుచేస్తే మంచిదని నయమానుకు తన సేవకుడుబోధించగా, అతడు దేవుని మాటలకు లోబడి శుద్ధుడయ్యాడు. అదేరీతిగా నేడు మీరును యేసుప్రభువును నమ్మి, బాప్తిస్మము పొందితే మీరును రక్షింపబడగల్గుదురు.

– సన్నీ దేవిడ్, న్యూఢిల్లీ

## బైబిలు అనబడు ఈ గ్రంధము
(This Book called the Bible)

"పుస్తకములు అధికముగా రచింపబడును, దానికి అంతము లేదు" అని సొలొమోను చెప్పాడు (ప్రసంగి 12:12). అయినను గ్రంథములన్నిటికంటే వేరుగా యున్న గ్రంధమొకటి కలదు, ఈ గ్రంధము దేవునిచే ముద్రింపబడి భద్రపరచబడి యున్నది. "ఆకాశమును భూమియు గతించును గాని, నామాటలు ఎన్నటికిని గతింపవు" అని యేసు చెప్పెను (మత్తయి 24:35). భద్రపరచబడి, సంరక్షింపబడుచున్న ఈ గ్రంధము, బైబిలు. అది దేవుని యొక్క ఆత్మావేశ వాక్యము. అందువలన ఆ గ్రంధమును చదువవలసిన బాధ్యత మనపై యున్నది. దానిని సరిగవిభజించి చదువ వలసిన బాధ్యత మనపై యున్నది. దానిని సరిగవిభజించి విశ్వసించి దాని బోధలకు మనం లోబడవలెను.

బైబిలును అర్ధము చేసికొనగలమా? అవును, తప్పక అర్ధము చేసికొనగలము. దానిని గూర్చి కొన్ని సూక్ష్మ సంగతులు తెలిసికొంటే మనకు సహాయ కరముగా యుండును. బైబిలులో పాతనిబంధన, క్రొత్తనిబంధనయని రెండు ముఖ్యభాగములున్నవి. -నిజానికి వాటిలో 66 పుస్తకములున్నవి, అవన్నీ ఒకే కధనమును గూర్చి చెబుతాయి. అందలి వర్తమేనగా, "క్రీస్తు వచ్చుచున్నారు, క్రీస్తువచ్చారు, క్రీస్తు మరల రాబోవుచున్నారు". పాతనిబంధనలో 39 పుస్తకములు, క్రొత్తనిబందనలో 27 పుస్తకములున్నవి.

**పాతనిబంధనను అర్ధము చేసికొనగలమా ?**

అవును! పాత నిబంధనలోని 39 పుస్తకములను 4 విభాగములుగ మనం చేయవచ్చును. 1) ధర్మశాస్త్రములోని 5 పుస్తకములు, ఆదికాండము, నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము, ద్వితీయోపదేశకాండము. 2) చరిత్రలోని 12 పుస్తకములు - యెహోషువ, న్యాయధిపతులు, రూతు, 1,2 సమూయేలు, 1,2, రాజులు, 1,2, దినవృత్తాంతములు, ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు. 3) పద్యకావ్యములు 5 - యోబు, కీర్తనలు, సామెతలు, ప్రసంగి మరియు పరమగీతములు 4) ప్రవచన గ్రంధములు 17- యెషయా, యిర్మియా, విలాపవాక్యములు, యెహెజ్కేలు, దానియేలు, హోషేయ, యోవేలు, ఆమోసు,

ఓబద్యా, యోనా, మీకా, నహూము, హబక్కూకు, జెఫన్యా, హగ్గయి, జెకర్యా మరియు మలాకీ గ్రంథములు. ఆత్మావేశ ఈ చరిత్రయదార్థము మరియు నమ్మత గినది.

**క్రొత్త నిబంధనను అర్థము చేసికొనగలమా?**

అవును ! క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములను నాలుగు భాగములుగ చేయవచ్చును. 1) సువార్తల రికార్డు. మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలు క్రీస్తుయొక్క జీవిత చరిత్ర తెలియజేయును. 2) అపొస్తలుల కార్యముల గ్రంథము క్రీస్తుసంఘస్థాపనను, పాపక్షమాపణను తెలియజేయును. 3) 21 పుస్తకములు క్రైస్తవ జీవనవిధానమును గూర్చి తెలియ జేయును మరియు 4) ప్రకటన గ్రంథము దేవుని ప్రజల నిత్య విజయమును తెలియజేయును.

దేవుని వాక్యాన్ని నేర్చుకొనుటకు సమయమును వెచ్చించుము. దాని బోధలను బట్టి జీవించుము, మరణించుము. ఈ జీవితానంతరము పరలోకమునకేగుము. బైబిలు యదార్థము. దాని బోధలను నీవు నమ్మవచ్చును, వాటిపై ఆధారపడ వచ్చును. దాని బోధనలననుసరించుట వలన నీ యాత్మ క్షేమముగా యుండును.

- చార్ల్సబాక్స్

## బెరయలోని వారు, థెస్సలోనికలోనివారు
## (The Bereans and the Thessalonians)

పౌలు, సీలాలు బెరయలో యేసు సువార్తప్రకటించినప్పుడు "బెరయలోని వారు థెస్సలోనికలోని వారి కంటె ఘనులై యుండిరి గనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును సీలయును చెప్పిన సంగతులు అలాగున ఉన్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములను పరిశోధించుచువచ్చిరి" (అపొ.కా. 17:11).

అంటే థెస్సలోనికలో యున్నవారెవరు వాక్యమును వినుటకు పరిశోధించుటకు ఆసక్తిలేనివారని అర్థమా? బెరయలో యూదులు పాతనిబంధన లేఖనములను పరిశోధించుటకు యేసు క్రీస్తును గూర్చి తెలిసికొనుటకుకును ఆసక్తి కలిగియుండిరి. ఆ ప్రవచనములు యేసుక్రీస్తునందు ఎట్లు నెరవేరెనో వారు గ్రహించగల్గిరి. ఆయనే నిజముగా రక్షకుడని వారు తెలిసికొనగల్గిరి. ఆ పట్టణములో పౌలు, సీలాలు అన్యజనులకును (గ్రీకులకు, యూదులుకాని వారికి) కూడ సువార్త బోధించిరి. యూదులలో అనేకులు

ను, గ్రీసుదేశస్థులైన వారిలో చాల మంది యు విశ్వసించిరి (అపో.కా. 17:12). సువార్తవలన వారందరు సహోదరులైరి (17:14).

థెస్సలోనికలో దానికి భిన్నముగా జరిగెను. అన్యజనులలో అనేకులును, యూదులలో కొందరును అక్కడ సువార్తకు లోబడిరి. అన్యజనులు తాము వెంబడించుచున్న మతాచారములను క్రీస్తు సువార్తతో పోల్చుకొన్నప్పుడు, వారు "గొప్ప ఉపద్రవమందు వాక్యమునంగీకరించిరి" (1 థెస్స 1:6). వారు మాసిదోనియలోను అకయలోను విశ్వాసులందరికి మాదిరియై యుండిరి. వారివలన ప్రతి స్థలమందును దేవుని యెడల వారికున్న విశ్వాసము వెల్లడియాయెను. (1థెస్స 1:7-8). మరియు వారు "విగ్రహములను విడిచిపెట్టి జీవముగలవాడును సత్యవంతుడునగు దేవునికి దాసులగుటకును దేవుడు మృతులలో నుండి లేపిన యేసు పరలోకము నుండి వచ్చునని యెదురు చూచుటకును ".... వారు యేలాగు దేవుని వైపునకు తిరిగితిరో ఆ సంగతిని వారే తెలియజేయుచున్నారు" (1 థెస్స 1:9-10).

గనుక థెస్సలోనికలో కొందరు యూదులును, అన్యజనులలో అనేకులును సువార్త వాక్యమును నిశితముగా పరిశోధించిరి. సువార్తకు లోబడుట ద్వారా వారు గొప్ప ధైర్యమును విశ్వాసమును ప్రదర్శించిరి (గలతీ 3:26-29, ఎఫెసీ 2:11-18). అయినను దేవుని వాక్యమును వారు ఇంకా చదివి నేర్చుకొనవలసి యున్నది. థెస్సలోనికలో యున్న క్రైస్తవులకు పౌలు వ్రాసిన మొదటి పత్రికలో వారు, "సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టు" వలెనని పౌలువారిని హెచ్చరించెను (1థెస్స 5:21).

ఈనాడు అనేక జనాంగములవారు క్రీస్తు వైపే తిరుగుచు ఆయనలో ఏకమవుచుండగా గొప్ప సంతోషము కలుగుచున్నది. అయినను మనము కూడ జాగ్రత్తకలిగి మెలకువగా యుండాలి. మనం వినుచున్న బోధలన్నిటిని దేవుని వాక్యమును బట్టి పరిశోధించాలి. అవి సత్యమో కాదో పరీక్షించాలి. మానవకల్పిత బోధల వలన మనము క్రీస్తునుండియు నిత్యజీవమునుండియు తొలగిపోకుండ చూచుకోవాలి (1 కొరింథీ 10:12; 9:27; హెబ్రీ 2:1-4; 3:12-14).

– రోయస్ ఫ్రెడరిక్

# సంక్షిప్త వార్తలు

2014 సెప్టెంబరు 2,3, తేదీలలో సికింద్రాబాదు యాప్రాల్‌లో ప్రత్యేక బైబిలు తరగుతులు నిర్వహించబడెను. అమెరికా నుండి వచ్చిన సోదరులు మార్క్‌రేనాల్డ్ గారును, జాషువా గూటం గారును ఆ ప్రత్యేక తరగతులులలో ఉపదేశించిరి. అనేకమంది స్థానికులు, విద్యావంతులు హాజరై దేవుని సత్యవాక్యము చక్కగా విశ్లేషించబడగా గొప్ప మేలు పొందిరి. యాప్రాల్‌లో నివాసముంటున్న సోదరులు లెమూయేల్ ఆచారియా దంపతుల సహకారముతో ఈ ప్రత్యేక తరగతులు ఘనముగా నిర్వహించబడెను.

2014 సెప్టెంబరు 4,5 తేదీలలో ఖమ్మం జిల్లా మణుగూరు క్రీస్తు సంఘ ఆవరణములో ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడెను, మార్క్ రేనాల్డ్ గారు, జాషువాగారు ఉపదేశించిరి. హాజరైన వారందరిలో మత శాఖల బోధకులే ఎక్కువ యుండుటచే, వాక్యసంబంధమైన వారి అనేక ప్రశ్నలకు జవాబునిస్తూ సోదరులు ఉపదేశించిరి. 4వ తేదీరాత్రి పగిడేరులో జరిగిన సువార్త కూటములో మార్కు గారు ఉపదేశించగా రోనీగూటం గారు తర్జుమా చేసిరి. 5వ తేదీసాయంత్రం పగ్గిడేరు ఎస్.టి. కోలనీలో యున్న ఒక యువకుడు క్రీస్తులోనికి బాప్తీస్మము పొందెను. మణుగూరు క్రీస్తుసంఘము, అక్కడి సువార్తికులు, వారి కుటుంబము ఈ ప్రత్యేక తరగతుల విషయంలో ఎంతగానో కృషి సల్పిరి.

2014 సెప్టెంబరు 6,7 తేదీలలో నూజివీడులో సువార్తికుల సహవాసకూటము, మైలవరం, వెల్వడంలో సువార్త కూటములు జరిగెను. నూజివీడులో మార్కురేనాల్డ్ గారు గంభీర ఉపన్యాసములు చేయగా రోనీ గూటం గారు తెలుగున కనువదించిరి. నూజివీడులో ఓర్సు ఆదాము గారి కుటుంబ పరిచర్య వర్ణనాతీతము, మైలవరంలోను, వెల్వడంలోను మార్కుగారు ఉపదేశించగా 7వ తేదీ ఆదివారం ఉదయం 12 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మైలవరంలో ఓర్సు ప్రభుదాసుగారును, వెల్వడంలో బి. యేసు బాబు గారును దేవుని కొరకు చక్కటి పనిచేయుచు ఆత్మలను సంపాదించుచున్నారు.

2014 సెప్టెంబరు 9వ తేదీనాడు పల్లంకుర్రులో సువార్తకూటము జరిగెను. పరిసర గ్రామములలో యున్న క్రైస్తవులు, క్రైస్తవేతరులు కూడ హజరై దేవుని వాక్యము వినిరి. ఒక వ్యక్తి క్రీస్తులోనికి బాప్తీస్మము పొందెను. పల్లంకుర్రులో బూల యోహాను, బూల చిరంజీవి గార్లు క్రీస్తు కొరకు పని చేయుచున్నారు. 10వ తేదీనాడు మార్కురేనాల్డ్ గారు, రోనీ దంపతులు, రిక్కీగూటం గారు, పశ్చిమగోదావరిలో కొడమంచిలిలో

జరిగిన కృతజ్ఞత కూటములో వాక్యపరిచర్య చేసిరి. కొడమంచిలిలో యన్. మోజేస్ గారు, వారి కుమారులు నిర్విరామ కృషి చేయుచున్నారు. సోదరులు యన్. మోజేస్ గారి ఆరోగ్యం సరిగా లేనందున ఆయన విషయం చదువరులు ప్రార్థించమనవి. 11వ తేదీనాడు సోదరులు వాడపర్రులో యున్న సంఘమును దర్శించి వాక్య పరిచర్య చేసిరి.

12,13 తేదీలలో తెలంగాణనుండి వచ్చిన ఇండిపెండెంట్ మతశాఖల బోధకులకు కాకినాడ లో ప్రత్యేక తరగతులు నిర్వహించబడగా వారిలో 11మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వారందరు తమ స్వగ్రామములకు తిరిగివెళ్లి ఇప్పుడు సత్య సువార్తచాటుచున్నారు.

2014 సెప్టెంబరు 14, 15 తేదీలలో కృష్ణాజిల్లా పరిటాలలో యున్న క్రీస్తు సంఘము వార్షిక సువార్త సభలను సోదరులు యమ్. రాజేంద్ర కుమార్ గారి ఆధ్వర్యమున నిర్వహించిరి. అనేకులు హాజరై దేవుని స్తుతించిరి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004